సాక్షి
వికారాబాద్

మంగళవారం । 6 । జూన్ । 2023



మంజూరు చేయండి

బొంరాస్‌పేట మండలానికి జూనియర్ కళాశాల మంజూరు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. 8లో▸



తడిసిన ధాన్యం కొంటాం

వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొంటామని తహసీల్దార్ చిన్నప్పల నాయుడు అన్నారు. చెంగోల్, గోనూర్‌లో పర్యటించారు. 9లో▸



నాణ్యమైన విద్య

కేసీఆర్ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

అడిషనల్ ఎస్పీగా శ్రీనివాసరావు

అనంతగిరి: వికారాబాద్ అడిషనల్ ఎస్పీగా(అడ్మినిస్ట్రేటివ్) కరగని శ్రీనివాస్‌రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీనివాస్‌రావు హైదరాబాద్ సీఐడీ విభాగంలో అడిషనల్ ఎస్పీగా పనిచేశారు. ఇక్కడ ఏఎస్పీగా పనిచేసిన ఎంఏ రషీద్ మూడు నెలల క్రితం బదిలీపై హైదరాబాద్ వెళ్లారు. వరంగల్ అదనపు డీసీపీగా ఉన్న పీవీ మురళీధర్ వికారాబాద్ డీటీసీ అడిషనల్ ఎస్పీ (అటాచ్డ్)గా పని చేశారు. అడిషనల్ ఎస్పీగా(అడ్మినిస్ట్రేటివ్) అదనపు బాధ్యతలు కూడా చూశారు. ఇదిలా ఉండగా మురళీధర్‌ను వికారాబాద్ డీటీసీ అడిషనల్ ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వైద్యశాఖలో ఔట్‌సోర్సింగ్ పోస్టులు

వికారాబాద్ అర్బన్: జిల్లా ఆస్పత్రుల పర్యవేక్షణ అధికారి కార్యాలయం ఆధీనంలో వివిధ ఆస్పత్రుల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రేడియాలజిస్ట్– 1, మైక్రోబయాలజిస్ట్– 1, ఫార్మసిస్ట్– 1, ల్యాబ్ అటెండర్– 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హులైన వారు 7నుంచి 12వ తేదీవరకు ఏరియా ఆస్పత్రిలోని డీసీహెచ్ఎస్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

'ఆశల' నిరసన



దోమ పీహెచ్‌సీ ఆవరణలో నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

దోమ: ఆశ కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు మాధవి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం దోమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చాలీచాలని జీతాలతో విధులు నిర్వర్తిస్తున్న ఆశ కార్యకర్తలు పని ఒత్తిడితో రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పనిభారం తగ్గించి వెంటనే జాబ్‌చార్ట్‌ను విడుదల చేయాలన్నారు. ప్రసూతి సెలవులు కల్పించి, 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్‌సీని వెంటనే విడుదల చేయాలన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్లు రాకొండ సునీత, లక్ష్మి, గౌరమ్మ, చంద్రకళ, బండకింది పద్మమ్మ, బుడ్డమ్మ, లావణ్య, సత్యమ్మ, శోభ, అంజమ్మ, అనిత, మహేశ్వరీ, అమృత, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నూతన డీఎఫ్‌ఓ



ఎమ్మెల్యేను కలిసిన డీఎఫ్‌ఓ

అనంతగిరి: నూతన డీఎఫ్‌ఓగా జ్ఞానేశ్వర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సోమవారం ఆయన మర్యాద పూర్వకంగా వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌ను కలిశారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత



జేసీబీతో నిర్మాణాల కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..

హయత్‌నగర్: మండలంలోని సాహెబ్‌నగర్‌లో సర్వే నంబర్ 71/1లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. సర్కార్ భూమిని రక్షించాల్సిన రెవెన్యూ అధికారులు బినామీ పేర్లతో కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ 'ప్రభుత్వ భూమికి ఎసరు' శీర్షికన ఈనెల 3న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింహ యాదవ్ ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో సిబ్బంది 11 ఇంటి నిర్మాణాలు, 5 ప్రహరీలను కూల్చివేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు అంజనేయులు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఇష్టారాజ్యం!

- నిబంధనలు పాటించని పాఠశాలలు
- కనిపించని ఆట స్థలాలు, ఫైర్ సేఫ్టీ ఉత్తిమాటే
- అడ్మిషన్ల పేరుతో డొనేషన్లు
- పోటీపడి ఫీజుల వసూలు
- తొంభైశాతం స్కూళ్లలో ఇదే పరిస్థితి
- పట్టించుకోని విద్యాశాఖ



వికారాబాద్: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. కనీస నిబంధనలు పాటించని స్కూళ్లకు సైతం అధికారులు అనుమతులు ఇస్తుండటం విమర్శలకు తావిస్తోంది. జిల్లాలోని మెజార్టీ ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నవే కావడం గమనార్హం.

- జిల్లాలో 220 ప్రైవేటు పాఠశాలలు ఉండగా ఇందులో పదిశాతం మాత్రమే నిబంధనల మేరకు కొనసాగుతున్నాయి. మిగిలిన తొంభై శాతం పాఠశాలలు రూల్స్ పాటించడం లేదు.
- ఓ తరగతి గదిని ఒకే కిటికీతో నిర్మించగా.. కొన్నింటికి ఆ ఒక్కటి కూడా లేదు. ఇలాంటి స్కూళ్లకు సైతం ఫైర్ సేఫ్టీ అనుమతులు రావడం ఆశ్చర్యం కలిగిస్తోంది.
- ప్రహరీ లేకుండా ప్రధాన రహదారుల పక్కనే కొనసాగుతున్న స్కూళ్లకు పోలీసులు ట్రాఫిక్ నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్లు ఇస్తున్నారు.
- తల్లిదండ్రుల ఫిర్యాదులు, ఆరోపణల నేపథ్యంలో అధిక ఫీజులు వసూలు చేసిన, ప్రభుత్వ సిలబస్ బోధించని యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి వదిలేశారు.
- పది శాతం పాఠశాలలకు మినహా ఆటస్థలం కూడా లేదు.
- నియామకాల సమయంలో బీఈడీ, పీజీ సర్టిఫికెట్లు ఉన్న వారిని చూపించి.. అర్హత లేని వారితో పాఠాలు చెప్పిస్తున్నారు.
- పాఠశాల వివరాలు, రికగ్నైజేషన్, రెన్యూవల్ సర్టిఫికెట్లు అందజేయాలని నోటీసులు పంపినా స్పందించడం లేదని తెలుస్తోంది.

ఫీజుల మోత

- పాఠశాలల్లో సౌకర్యాల కల్పనను పట్టించుకోని నిర్వాహకులు ఫీజుల విషయంలో పోటీ పడుతున్నారు.
- డొనేషన్లు వసూలు చేయకూడదనే నిబంధన ఉన్నప్పటికీ.. అడ్మిషన్ ఫీజు పేరుతో రూ.వేలకు వేలు వసూలు చేస్తున్నారు.
- ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.30 వేల నుంచి రూ.1.30 లక్షల వరకు వసూలు చేస్తున్నారు.
- కొన్ని పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ పిల్లలకే రూ.35 వేలకు పైగా తీసుకుంటున్నారు. ప్రభుత్వం నిర్ధారించిన ఫీజులతో పోలిస్తే ఇది పది రెట్లు అధికం.
- ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు పక్క పెట్టి సొంత పుస్తకాలతో బోధిస్తున్నారు. స్కూల్‌లోనే దుకాణాలు తెరిచి బుక్స్ విక్రయిస్తున్నారు.

తెలంగాణలో విద్యుత్ కాంతులు

- సీఎం కేసీఆర్ కృషితోనే మార్పు సాధ్యమైంది
- తన పనితీరుతోనే విమర్శకుల కళ్లు తెరిపించారు
- వ్యవసాయానికి నిరంతర ఉచిత కరెంట్ ఆయనకే సాధ్యమైంది
- ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్, చిత్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కలెక్టర్

వికారాబాద్ అర్బన్: ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ సరఫరా ఎంతో దయనీయంగా ఉండేదని.. తెలంగాణ వచ్చిన తర్వాత అసలు కరెంట్ సమస్యే లేకుండా పోయిందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో 'విద్యుత్ విజయోత్సవం' నిర్వహించారు. ఈ సందర్భంగా గౌలికర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ కృషి, పట్టుదలతో విద్యుత్ సరఫరాలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే చీకట్లు కమ్ముకుంటాయని ఆరోపణలు చేసిన వాళ్ల కళ్లు తెరిపించారన్నారు. వ్యవసాయానికి 24గంటల పాటు ఉచిత కరెంట్ సరఫరా చేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కిందని సంతోషం వ్యక్తంచేశారు. సరిహద్దు రాష్ట్రాల ప్రజలు మన రాష్ట్రంలో భూములు తీసుకుని పంటలు సాగు చేసుకుంటున్నారన్నారు. జిల్లాలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవసమైన సబ్ స్టేషన్ల ఏర్పాటుకు స్థలాలు కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. ఆవెంటనే పనులు ప్రారంభిస్తామని స్పష్టంచేశారు.

చాలా మెరుగైంది..

కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కరెంటు వ్యవస్థ బాగా మెరుగుపడిందని తెలిపారు. రానున్న రోజుల్లో విద్యుత్‌తో నడిచే వాహనాలే ఎక్కువగా ఉంటాయన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యుత్ సరఫరా పెరగడంతో వ్యవసాయంతో పాటు, పారిశ్రామిక, వాణిజ్య రంగాలు మంచి పురోగతి సాధించాయని స్పష్టంచేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడక ముందు 7,778 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసేవారమని, ప్రస్తుతం 15,556 మెగావాట్లు ఉత్పత్తి అవుతోందని వివరించారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం పెరిగినప్పటికీ గృహ అవసరాలకు నాణ్యమైన సరఫరా అందించడంతో పాటు, కుల వృత్తులైన నాయీబ్రాహ్మణులు, రజకులకు ప్రభుత్వం 250 యూనిట్లు ఉచితంగా అందజేస్తోందని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఎంపీపీ చంద్రకళ, కౌన్సిలర్ అనంత్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, విద్యుత్ సూపరింటెండెంట్ జయరాజు పాల్గొన్నారు.

నేడు 'పారిశ్రామిక ప్రగతి'

- రేపు సాగునీటి దినోత్సవం
- 8న చెరువుల పండుగ
- అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహించాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం



కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పారిశ్రామిక ప్రగతి, 7న సాగునీటి దినోత్సవం, 8న ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయా శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణంలోని తేజ ఫంక్షన్ హాల్‌లో సుమారు వెయ్యి మందితో పారిశ్రామిక ప్రగతి వేడుక నిర్వహించాలని సూచించారు. టీఎస్ ఐపాస్ ద్వారా లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ ఇందులో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం నిర్వహించే సాగునీటి దినోత్సవానికి ప్రజలను పెద్ద సంఖ్యలో తరలించాలని సూచించారు. అన్ని నియోజకవర్గాల్లోనూ వెయ్యి మందికి తగ్గకుండా సంబరాల్లో పాల్గొనేలా చూడాలన్నారు. వికారాబాద్ సెగ్మెంట్‌కు సంబంధించిన వెయ్యి మందిని గౌలికర్ ఫంక్షన్ హాల్‌కు తీసుకురావాలని సూచించారు. 8న చెరువుల పండుగ నిర్వహించే జలాశయాల వివరాలను వెంటనే అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం నిర్వహించేందుకు మండల, గ్రామ స్థాయి కమిటీలు వేసుకోవాలని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, వేడుకలను విజయవంతం చేయాలన్నారు.

కమిషనరేట్ దాటాల్సిందే

మూడేళ్ల సర్వీస్ నిండినవారికి స్థానచలనం తప్పదు

- ఎన్నికల బదిలీలకు నగర పోలీసు విభాగం కసరత్తు
- తాజాగా మార్గదర్శకాలు జారీ చేసిన ఎన్నికల సంఘం
- ఇన్‌స్పెక్టర్లకు కమిషనరేట్, ఎస్సైలకు జోన్లే యూనిట్
- జాబితాలు సిద్ధం చేస్తున్న సిటీ పోలీసు ఉన్నతాధికారులు



సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనరేట్‌లో ఎన్నికల బదిలీలకు సన్నాహాలు జరుగుతున్నాయి. తాజాగా ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ఆధారంగా ముందుకు వెళ్తున్నారు. వీటి ప్రకారం గడిచిన నాలుగేళ్లలో కమిషనరేట్‌లో వరుసగా మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఇన్‌స్పెక్టర్లు బయటకు వెళ్లాల్సి ఉండగా... జోన్‌లో ఈ కాలపరిమితి పూర్తయిన ఎస్సైలకూ స్థానచలనం తప్పదు. ఈ గడువు పూర్తి కాకున్నా.. సొంత నియోజకవర్గాల్లో పని చేస్తున్న వారికీ స్థానచలనం తప్పదు. సైబరాబాద్, రాచకొండల్లో పని చేస్తున్న అధికారులు మాత్రం పరిధి అంశంలో సేఫ్‌జోన్‌లో ఉన్నారు.

వర్తమానం పంపిన జోనల్ ఐజీ..

డీజీపీ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు గత వారం సిటీ పోలీసులకు ఓ సందేశం పంపారు. ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన ఉత్తర్వుల్నీ జత చేశారు. వీటి ప్రకారం 2020 జనవరి 30 నుంచి 2024 జనవరి 31 (నాలుగేళ్ల కాలం) మధ్య మూడేళ్ల పాటు కమిషనరేట్‌లో పని చేసిన ఇన్‌స్పెక్టర్లు, ఒకే జోన్‌లో విధులు నిర్వర్తించిన ఎస్సైల జాబితాలు సిద్ధం చేయాల్సి ఉంది. 2024 జనవరి ఆఖరు నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది. ఈ నేపథ్యంలోనే దాన్ని కటాఫ్ డేట్‌గా తీసుకున్నారు. కేవలం కంప్యూటరైజేషన్, స్పెషల్ బ్రాంచ్, ట్రైనింగ్ విభాగాల్లో పని చేసే వారికి మాత్రమే మినహాయింపు ఉండనుంది. గతంలో ఎన్నికల సంఘం టాస్క్‌ఫోర్స్, ఎస్‌ఓటీలను లూప్ లైన్స్‌గా పరిగణించినప్పటికీ ఈసారి ఆ అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు.

ఒకే రెవెన్యూ జిల్లాలో కమిషనరేట్..

ఈ అధికారులతో పాటు స్థానిక జిల్లాలో పని చేస్తున్న, ఆరోపణలు ఎదుర్కొంటున్న, గతంలో ఎన్నికల సంఘం ఆగ్రహానికి లోనైన, కేసులు పెండింగ్‌లో ఉన్న అధికారుల వివరాలూ ఆరా తీస్తున్నారు. ఈ సమగ్ర వివరాలతో జాబితాలు రూపొందించి ఐజీ కార్యాలయానికి పంపడంతో పాటు బదిలీలకు కసరత్తు చేయనున్నారు. నిర్ణీత గడువు పూర్తి చేసుకున్న ఇన్‌స్పెక్టర్లు కచ్చితంగా కమిషనరేట్ దాటి బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. సాధారణంగా ఎన్నికల బదిలీలన్నీ రెవెన్యూ జిల్లా పరిధిగా తీసుకుంటారు. హైదరాబాద్ కమిషనరేట్ మొత్తం హైదరాబాద్ రెవెన్యూ జిల్లాలో ఉండటంతో ఇక్కడ పని చేస్తున్నవారిపై ప్రభావం ఎక్కువగా ఉండనుంది. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లు మేడ్చల్, యాదాద్రి, రంగారెడ్డి సహా మరికొన్ని జిల్లాల్లో పాక్షికంగా విస్తరించి ఉన్నాయి. దీంతో కమిషనరేట్‌లోనే వేరే జోన్‌లో నియమించుకునే ఆస్కారం ఏర్పడటంతో వీళ్లు 'సేఫ్‌జోన్'లో ఉన్నట్లైంది.

'కొత్త చిక్కులకు' ఆస్కారం లేకుండా..

నిబంధనల ప్రకారం నగరంలో పని చేస్తున్న ఇన్‌స్పెక్టర్లలో దాదాపు 60 శాతం మంది సిటీ విడిచి పెట్టి వెళ్లాల్సి వచ్చే ఆస్కారం ఉంది. గత ఎన్నికల సమయంలోనూ ఇలాగే భారీ స్థాయిలో ఇన్‌స్పెక్టర్ల బదిలీలు యూనిట్ బయటకు జరిగాయి. దీంతో సిటీకి చెందిన వారు బయటకు, బయటి వారు సిటీలోకి వచ్చారు. ఇలా సిటీపై పట్టులేని కొత్త వారు రావడంతో బందోబస్తు విధుల్లో కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈసారి ఇబ్బందులకు ఆస్కారం లేకుండా పోలీసు విభాగం కసరత్తు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇన్‌స్పెక్టర్ నుంచి డీఎస్పీ, డీఎస్పీ నుంచి అదనపు ఎస్పీ పదోన్నతులకు సన్నాహాలు జరుగుతున్నాయి. వీరితో సిటీలో పని చేసిన అనుభవం ఉన్న వాళ్లు అవసరమైన సంఖ్యలో ఉంటారు. కొందరు వివిధ ఠాణాల్లో స్టేషన్ హౌస్ ఆఫీసర్లుగానూ (ఎస్‌హెచ్‌ఓ) ఉన్నారు. వీరికీ మూడేళ్లు పూర్తయినా.. పదోన్నతి రావడంతో కొనసాగే ఆస్కారం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ప్రయోగం చేశారు.. అమలు మరిచారు!

గంటకు వంద కిలోమీటర్ల వేగంతో రైలు దూసుకెళ్తోంది. ఎదురుగా ఎరుపు రంగు సిగ్నల్ పడింది. అయినా లోకో పైలెట్ రైలును నియంత్రించలేదు. ఇందులో రైల్వే శాఖ బోర్డు సభ్యులు, ఉన్నతాధికారులు ఉన్నారు. అందరిలో ఒకే ఉత్కంఠ.. అయితే రైలు వేగం క్రమంగా తగ్గుతూ వచ్చింది. చివరకు ఎరుపు రంగు సిగ్నల్ దాటకుండా ఆటోమేటిక్‌గా ఆగిపోయింది. దీంతో 'టీకాస్' (ట్రైన్ కొలీజియన్ అవాయిడెన్స్ సిస్టం) ప్రయోగం విజయవంతమైందని అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

- వికారాబాద్‌లోనే టీకాస్ తొలి పరీక్ష
- అత్యాధునిక పరిజ్ఞానంతో ఏడాదిన్నరపాటు శ్రమించిన బృందం
- విజయవంతమై పదేళ్లు దాటినా.. పట్టించుకోని కేంద్రం
- ఒడిశా ఘటనతో ప్రయాణికుల్లో ఆందోళన



తాండూరు: రైలు ప్రమాదాల నియంత్రణకోసం కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన టీకాస్ ప్రయోగం విజయవంతమై పదేళ్లు దాటినా.. అన్ని ట్రాక్‌లపై దీన్ని అమలు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో రైలు ప్రమాదాలు జరిగి వందలాది మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోతున్నారు.

ఏడాదిన్నర పాటు..

ఒకే ట్రాక్‌పై ఎదురెదురుగా, వెనుక నుంచి రైళ్లు ఢీకొని సంభవించే ప్రమాదాల నివారణకు భారతీయ రైల్వే అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన టీకాస్ ప్రయోగానికి వికారాబాద్ జిల్లా వేదికైంది. ఏడాదిన్నర పాటు నిర్విరామంగా ఇక్కడ టీకాస్ ప్రయోగం చేశారు. రైళ్లు ప్రమాదానికి గురికాకుండా సురక్షిత ప్రయాణం దీని ముఖ్య ఉద్దేశమైనా ఆచరణలో పెట్టడంలో రైల్వే శాఖ ఉదాసీనత కనబర్చింది. దశాబ్ద కాలంలో దేశ వ్యాప్తంగా తరచూ ప్రమాదాలు సంభవించి ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. టీకాస్ అమలుకు నిధులు కేటాయించడంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంలో మూడు రైళ్లు ఢీ కొట్టడంతో 1,500 మందికి పైగా తీవ్రంగా గాయపడగా.. 275 మంది వరకు మరణించారు. టీకాస్(కవచ్) అమలు చేస్తే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని స్థానికులు అంటున్నారు. గతంలో తాండూరు– మంతట్టి రైల్వే స్టేషన్ల మధ్య రెండు రైళ్లు ఎదురెదురుగా ప్రయాణించిన సందర్భంలో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

30 రకాల ఫీచర్లతో ప్రయోగం

రైలు ప్రమాదాల నివారణకు 2012లో అప్పటి కేంద్ర ప్రభుత్వం యూరప్ దేశాల్లో అమలులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని మించిన స్థాయిలో మనదేశంలోనూ అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం భారతీయ రైల్వే పరిశోధన సంస్థ(ఆర్డీఎస్ఓ) రూపొందించిన డిజైన్‌తో టీకాస్ ద్వారా 2012లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని లింగంపల్లి– వికారాబాద్, కర్ణాటక రాష్ట్రంలోని వాడి జంక్షన్ వరకు సుమారు 250 కిలోమీటర్ల మేర టీకాస్ ప్రయోగం నిర్వహించారు. ఆర్డీఎస్ఓ అధికారుల బృందం నేతృత్వంలో టీకాస్ డిజైన్‌లను కర్నెక్స్, మేధా, హెచ్‌బీఎస్ కంపెనీలు రైల్వే ట్రాక్‌లపై ప్రయోగించాయి. ఏడాదిన్నర పాటు కొనసాగిన ఈ ప్రయోగం సక్సెస్ అయిందని అప్పట్లో రైల్వే శాఖ బోర్డు చైర్మన్‌తో పాటు ఉన్నత స్థాయి అధికారులు ధ్రువీకరించారు. రూ.40 కోట్ల వ్యయంతో 30 రకాల ఫీచర్లతో ప్రయోగం చేశారు. 2012 నుంచి 2014 వరకు పలుసార్లు ప్రయోగం చేశారు. మొదట వికారాబాద్ జిల్లాలోని బషీరాబాద్ మండలం మంతట్టి– నవాంద్గి– వాడి రైల్వే స్టేషన్ల మధ్య ప్రయోగం సాగింది. తర్వాత వికారాబాద్, లింగంపల్లి, బీదర్ రైల్వే లైన్లపై ఈ ప్రయోగం చేశారు.

పేరు మార్పుతోనే సరి..

రెండు రైళ్లు ఒకే ట్రాక్‌పై ఒకదాని వెనక ఒకటి ప్రయాణించినా ప్రమాదాలు సంభవించకుండా ఉండేందుకు 2012– 14 మధ్య టీకాస్(ఏటీపీఎస్) ప్రయోగం నిర్వహించారు. అయితే 2014 తర్వాత కేంద్రంలో ప్రభుత్వం మారింది. గత ప్రభుత్వం చేపట్టిన రైలు ప్రమాదాల నివారణ ప్రయోగం విజయవంతమైనా అమలులోకి తీసుకురావడంతో ప్రస్తుత ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ప్రయోగం సమయంలో టీకాస్‌గా పిలిచినా.. ఆతర్వాత ఏటీపీఎస్‌గా మార్చారు. తర్వాత కాలంలో కవచ్‌గా నామకరణం చేశారు. అయితే దశాబ్దకాలంగా ఇప్పటి వరకు దాదాపు 1,500 కిలోమీటర్ల రైల్వే లైన్‌లోనే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం గమనార్హం.

కేంద్రం స్పందించేనా..?

రైలు ప్రమాదాల నివారణకు అత్యంత భద్రతతో కూడిన కవచ్(టీకాస్) అమలుకు బడ్జెట్ కేటాయించడంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఒడిశా దుర్ఘటనతోనైనా రైల్వే ప్రమాదాల నియంత్రణకు తగిన చర్యలు చేపడుతుందా.. లేదా వేచిచూడాల్సిందే.

లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులు వెంటనే చేపట్టాలి



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొందుర్గు: లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులను వెంటనే చేపట్టాలని టీపీసీసీ కార్యదర్శి ఆలుగడ్డ ప్రవీణ్‌యాదవ్ డిమాండ్ చేశారు. ప్రాజెక్టు నిర్మించడానికి గుర్తించిన ప్రదేశంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌యాదవ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికలకు ముందు ఈ ప్రాంత ప్రజలకు ప్రాజెక్టు నిర్మిస్తామని నమ్మించి ఓట్లు వేయించుకొన్నారని, అధికారం చేపట్టాక మరిచిపోయారన్నారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే ప్రాజెక్టు పనులు మొదలు పెట్టాలని లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పుష్పమ్మ, ఇందిర పాల్గొన్నారు.

నిషేధిత పత్తి విత్తనాల పట్టివేత



స్వాధీనం చేసుకున్న పత్తి విత్తనాలను చూపుతున్న శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి

శంషాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించిన పత్తి విత్తనాలను రైతులకు విక్రయించి సొమ్ముచేసుకుంటున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన శంషాబాద్ జోన్ ఎస్ఓటీ పోలీసులు 1.5 టన్నుల పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, భీమవరానికి చెందిన తోటకూర రంగారావు కర్నూలు జిల్లాలో స్థిరపడ్డాడు. కృష్ణగిరి మండలం, గోకులపాడు గ్రామంలో భూమిని కౌలుకు తీసుకున్న అతను ప్రభుత్వం నిషేధించిన బీజీ–111/ హెచ్‌టీ పత్తిని సాగు చేస్తున్నాడు. అనంతరం కర్నాటకలోని మిల్లులో పత్తి గింజలను వేరు చేయించిన అతను వాటికి రసాయనాలు కలిపి సాధారణ పత్తి విత్తనాలుగా మార్చి రైతులకు విక్రయిస్తున్నాడు. షాద్‌నగర్ పరిసర గ్రామాల్లో పత్తివిత్తనాలు విక్రయించేందుకు వచ్చిన అతడిని శంషాబాద్ జోన్ ఎస్ఓటీ పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు.

పదేళ్లుగా ఇదే దందా

రంగారావు దాదాపు పదేళ్లుగా నిషేధిత పత్తి విత్తనాలను రైతులకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గతంలో అదిలాబాద్, తాండూరు ప్రాంతాల్లోనూ అతడిపై కేసులు నమోదైనట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన విత్తనాలను మాత్రమే రైతులు కొనుగోలు చేయాలని డీసీపీ సూచించారు. నకిలీలు, నిషేధిత విత్తనాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. నకిలీ విత్తనాలు, నిషేధిత విత్తనాలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. కేసును ఛేదించిన శంషాబాద్ ఎస్ఓటీ బృందాన్ని డీసీపీ అభినందించారు. సమావేశంలో షాద్‌నగర్ ఏసీపీ కుశాల్కర్, శంషాబాద్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠాపన



బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తదితరులు

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం చౌడాపూర్ మండలం మరికల్ పంచాయతీ అనుబంధ గ్రామం అంతంపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తితో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అనంతరం ఉత్సవాల నిర్వహణకు రూ. 25వేల విరాళాన్ని నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాండు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు



హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న విద్యాశాఖ అధికారులు

తాండూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. వికారాబాద్ నుంచి తాండూరు ఎమ్మార్సీకి పుస్తకాలు చేరాయి. సోమవారం సీఆర్పీలు మల్లేష్, వెంకటమ్మ, ఐఈఆర్టీ విద్యాధర్ ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు పాఠ్య పుస్తకాలు అందజేశారు. ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలను అందజేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు రూరల్: తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్ట్ పద్ధతిన అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రకాష్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు వివిధ సబ్జెక్టులు బోధించేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రతి నెలా రూ. 18,500 వేతనం ఉంటుందని తెలిపారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 8096226651లో సంప్రదించాలని కోరారు.

బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



పిడుగుపాటుకు మృతి చెందిన మేకలను పరిశీలిస్తున్న భీంరెడ్డి తదితరులు

కుల్కచర్ల: పిడుగుపాటు వల్ల ఆర్థికంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి డిమాండ్ చేశారు. కుల్కచర్ల మండలం సాల్వీడు గ్రామంలో ఆదివారం పిడుగుపాటుకు గురై 23 మేకలు మృతి చెందిన విషయం తెలిసిందే. బాధిత రైతులను సోమవారం భీంరెడ్డి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యం వల్ల నష్టపోయిన రైతులకు జిల్లా అధికారులు న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్ తన ప్రత్యేక నిధుల ద్వారా రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలయ్య, ఘనపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్, బాధిత రైతులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పూడూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గిరి కథనం మేరకు.. యాలాల మండలం ముద్దాయిపేట గ్రామానికి చెందిన ఏ బందెప్ప(35) హైదరాబాద్‌లో మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 1న సొంత ఊరు ముద్దాయిపేటకు వచ్చాడు. సోమవారం బైక్‌పై హైదరాబాద్‌కు వెళుతుండగా పూడూరు మండలం రాకంచర్ల వద్ద వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బందెప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్రమత్తతతోనే రక్ష



షాబాద్‌లో కేజ్‌వీల్స్‌తో పొలం దున్నుతున్న రైతులు

- కేజ్‌వీల్స్‌తో జాగ్రత్త
- ప్రాణాలతో చెలగాటం వద్దు

షాబాద్: ప్రస్తుత కాలంలో వ్యవసాయంలో యంత్రాల వినియోగం ఎక్కువైంది.పొలం దున్నేందుకు, జంబు కొట్టేందుకు ట్రాక్టర్ కేజ్‌వీల్స్‌ను వినియోగిస్తున్నారు. కేజ్‌వీల్స్‌తో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి డ్రైవర్లు కేజ్‌వీల్స్ కిందపడి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు అనేకం. ప్రస్తుతం వానాకాలం సాగు ప్రారంభమైంది. వర్షాలు కూడా కురుస్తున్నాయి. రైతులు పంట పొలాలను సిద్ధం చేస్తున్నారు. ఈ తరుణంలో డ్రైవర్లు కేజ్‌వీల్స్ నడిపించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రమాదాలకు కారణాలు

పొలాలు అన్ని ఒకేలా ఉండవు. పొలాన్ని నీటితో నింపిన తర్వాత డ్రైవర్‌కు భూమి ఎలాంటిదో తెలియక పోవడం. నారు ఎక్కువగా ఉన్న స్థలంలో ఎక్కువ లోతుకు కేజ్‌వీల్ వెళ్లడం. అక్కడ భూమి వదులుగా మారడం జరుగుతుంది. గట్టి ప్రదేశంలో వెళ్లడానికి డ్రైవర్లు యాక్సిలేటర్ ఎక్కువగా ఇస్తుంటారు. బరువంతా కేజ్‌వీల్స్‌పై పడుతుంది. దీంతో ముందు టైర్లు బరువులేక ట్రాక్టర్ బోల్తా పడే అవకాశాలు ఉంటాయి. పొలం చివరి మూలల్లో ఎక్కువ సార్లు కేజ్‌వీల్స్ నడుస్తాయి. అక్కడ లోతుగా తయారవుతోంది. వేగంగా వెళ్లే క్రమంలో దిగబడి బోల్తా పడుతుంది. డ్రైవర్లకు పూర్తిస్థాయి నైపుణ్యత లేక, ఓవర్ స్పీడ్‌తో పొలాల్లో దున్నడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాక్టర్ దున్నడంలో లోతు పెరిగిన కొద్ది ప్రమాదాలు ఎక్కువగా జరిగే ఆస్కారం ఉందని ఇంజనీరింగ్, వ్యవసాయ శాస్త్రవేతలు, నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ముందస్తు జాగ్రత్తలు

- కేజ్‌వీల్స్ బిగించేటప్పుడు తప్పనిసరిగా వెనుక టైర్లు సమాన స్థాయిలో ట్రాక్టర్ బంపర్ ముందు వెయిట్ బిల్లలు వేసుకోవాలి.
- బరువు ఎక్కువతే మైలేజ్ తక్కువగా వస్తుందనే ఉద్దేశంతో వాడడం లేదు. అది సరైన విధానం కాదు.
- ట్రాక్టర్‌ను పొలంలోకి దించే ముందు పూర్తిస్థాయి కండిషన్‌గా ఉంచుకోవాలి.
- పొలం దున్నుతున్న సమయంలో ట్రాక్టర్‌ను ఎప్పుడు ఒకే వేగంతో నడపాలి.
- యజమానుల మెప్పు కోసం వేగం పెంచొద్దు.
- మూల మలుపు దగ్గర వేగం తగ్గించాలి.
- కేజ్‌వీల్స్‌తో దున్నేప్పుడు ట్రాక్టర్‌కు కల్టివేటర్ అమర్చుకోవాలి.
- దీంతో బోల్తా పడే అవకాశాలు తక్కువగా ఉంటాయి.



అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థినులు

కళాశాల మంజూరు చేయండి

- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

బొంరాస్‌పేట: ఉమ్మడి బొంరాస్‌పేట మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులతో కలసి మండల అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు బీ చంద్రయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్ మాట్లాడారు. చదువుకోవడానికి కళాశాలలు, ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బాలికలు పదో తరగతి వరకే చదివి విద్యకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సి వస్తోందన్నారు. విద్యార్థి సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఉమ్మడి బొంరాస్‌పేట మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

పరిగిలో గడపగడపకూ డీఎస్పీ



డీఎస్పీ పరిచయ కార్యక్రమంలో నాయకులు

పరిగి: రాష్ట్రంలో బహుజన రాజ్యస్థాపనకే ధర్మ సమాజ్ (డీఎస్పీ)పార్టీ గడప గడపకూ కార్యక్రమం చేపడుతోందని ఆ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు రవీందర్ అన్నారు. సోమవారం పట్టణంలో పార్టీ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 3కోట్ల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఉంటే రాజ్యాధికారం మాత్రం అగ్రవర్ణాల చేతిలో ఉందన్నారు. ఎంత కాలం బానిసలుగా బతకాలన్నారు. రాష్ట్రంలో 90శాతం ఉన్న బహుజనులు పదిశాతం ఉన్న అగ్రవర్ణాలకు కుర్చీ వేసి కూర్చోబెడుతున్నామన్నారు. మన ఓట్లతో మన రాజ్యాన్ని స్థాపించుకునే రోజులు ఎంతో దూరంలో లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లేష్, జగన్, సుదర్శన్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్‌ను కలిసిన శుభప్రద్‌పటేల్

హైదరాబాద్ కోకాపేటలో భారత్ భవన్ భూమి పూజ కార్యక్రమంలో సీఎం కేసీఆర్‌ను రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

– అనంతగిరి

బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ ఖాయం

- చేవెళ్ల అసెంబ్లీ టికెట్ ఇచ్చేందుకు సీఎం సుముఖత
- 'పల్లె పల్లెకు రత్నం'లో మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం

చేవెళ్ల: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు బీఆర్‌ఎస్‌పై ప్రత్యేక అభిమానం ఏర్పడిందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం అన్నారు. సోమవారం ఆయన పల్లె పల్లెకు రత్నం కార్యక్రమం ద్వారా మండల పరిధిలోని రావులపల్లి, కుమ్మెర, మల్కాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను తెలుసుకోవటంతోపాటు ప్రభుత్వం వారికి అందిస్తున్న పథకాలపై ఆరాతీస్తుంటే ప్రభుత్వంపై ప్రత్యేక అభిమానం కనిపిస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమన్నారు. ఉద్యమ సమయంలో సీఎం కేసీఆర్‌తో కలిసి పనిచేశానని.. వచ్చే ఎన్నికల్లో చేవెళ్ల అసెంబ్లీ టికెట్ తనకు కేటాయించాలని కోరానని చెప్పారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. పల్లె పల్లెకు రత్నం కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను తీసుకెళ్లి వారిని చైతన్యం చేస్తున్నామన్నారు. టికెట్ ఎవరికి ఇచ్చినా పార్టీ, చేవెళ్ల ప్రజల కోసమే పని చేస్తానన్నారు. తనకు రాజకీయ వారసులు లేరని నా కుటుంబం నుంచి రాజకీయాల్లోకి ఎవరూ రారని ప్రజలకు వాగ్దానం చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్కాపూర్ మాణిక్యరెడ్డి, శివారాజు, రాంచంద్రయ్యగౌడ్, పాండుగౌడ్, నాగరాజు, సుదర్శన్, కుమార్, రవి, నరేశ్, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మల్కాపూర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న కేఎస్ రత్నం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వికారాబాద్ అర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ సీ మంజుల అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ, లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్ అండ్ మున్సిపల్ శాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణం బాగుంటేనే మానవ మనుగడ అద్భుతంగా ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి గ్రీనరీని పెంచాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర, నాయకులు రాజ్‌కుమార్, లైఫ్ స్టైల్ ఎన్విరాన్మెంట్ ప్రతినిధి సిద్ధార్థ పాల్గొన్నారు.



పర్యావరణంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

బకాయి డబ్బులు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

అనంతగిరి: ఉపాధి కూలీలకు రోజు కూలి రూ. 600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలీల బకాయి డబ్బులు వెంటనే విడుదల చేయాలన్నారు. పని ప్రదేశంలో ప్రమాదం జరిగితే రూ.10లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, సత్తయ్య, రఘురాం, శేఖర్, లాలయ్య, లక్ష్మణ్, విజయ్, వెంకటయ్య, గోపాల్, ప్రభు, బాబు తదితరులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టండి

- రద్దు చేసిన గ్రూప్–1 ప్రిలిమ్స్ టాపర్స్ లిస్ట్ బయటపెట్టాలి
- టీఎస్‌పీఎస్సీ ముట్టడిలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మల్లేశ్



టీఎస్పీఎస్సీని ముట్టడించిన బీఎస్పీ నేతలు

ఇబ్రహీంపట్నం: పేపర్ లీకేజీ అంశాన్ని సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి నిందితులపై చర్యలు తీసుకోవాలని, నూతన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు గ్యార మల్లేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ రద్దు చేసిన తర్వాతే గ్రూప్–1, ఇతర పోటీ పరీక్షలు నిర్వహించాలనే డిమాండ్‌తో పార్టీ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం టీఎస్‌పీఎస్సీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ మేరకు నగరంలో పోలీసులు బీఎస్పీ నేతలను అరెస్ట్ చేసి వివిధ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. రద్దు చేసిన గ్రూప్–1 ప్రిలిమ్స్ టాపర్స్ లిస్టును వెంటనే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సిట్, ఈడీ విచారణ ఎదుర్కుంటున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ గ్రూప్–1 ప్రిలిమ్స్ ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. విచారణలో చైర్మన్ జనార్దన్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన 16 పరీక్షల పేపర్లు లీకైనట్లు తెలిసినా కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న చైర్మన్ నేతృత్వంలోనే గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు జూన్ 11న రీషెడ్యూల్ విడుదల చేయడం అప్రజాస్వామికమని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నేతలను పోలీసులు అరెస్టు చేయడం స్వేచ్ఛను హరించడమేనన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పి.రాములు, ప్రహ్లాద్, మహేందర్, గణేశ్, బి.మహేందర్, కృష్ణ, మైసయ్య, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి బస్టాండ్‌లో మహిళ అదృశ్యం



రాజేశ్వరి (ఫైల్)

పరిగి: నగరం నుంచి తల్లిగారి ఊరు ముదెన గ్రామానికి వెళుతున్న మహిళ పరిగి బస్టాండ్‌లో కనిపించకుండా పోయిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన రవీందర్‌రెడ్డి రెండు నెలల క్రితం కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ జిల్లా, ముదెన గ్రామానికి చెందిన రాజేశ్వరీని వివాహం చేసుకున్నాడు. దంపతులు సోమవారం నగరం నుంచి ముదెన్ గ్రామానికి ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. పరిగి బస్టాండ్‌కు బస్సు రాగానే రాజేశ్వరీ బహిర్భూమికి వెళ్లి వస్తానని భర్తకు చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో రవీందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పరిగి: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి సోమవారం మృతి చెందాడు. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సుల్తాన్‌పూర్‌కు చెందిన తాజొద్దీన్(23), షబ్బీర్ ఈ నెల 3న పొలం నుంచి బైక్‌పై ఇంటికి వస్తుండగా మరో బైక్ ఢీ కొంది. తీవ్రంగా గాయపడిన తాజొద్దీన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

పరిశ్రమల ఏర్పాటుతో పంటలకు నష్టం

- కాలుష్యకారక కంపెనీలకు అనుమతులు ఇవ్వొద్దు
- తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభుదాస్

కొందుర్గు: పరిశ్రమల కారణంగా పంటలపై దెబ్బ పడుతోందని.. అటువంటి పరిశ్రమలకు అనుమతులు ఇవ్వొద్దని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జె.ప్రభుదాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రమేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రభుదాస్ మాట్లాడుతూ.. ఆహార భద్రతకు, పర్యావరణానికి హాని కలిగించే పరిశ్రమలకు అనుమతులు నిరాకరించాలని కోరారు. ఇప్పటికే పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యంతో పంటలు తీవ్రంగా నష్టపోయి అన్నదాతలు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాడి పశువులు రోగాల బారిన పడుతున్నాయని వాపోయారు. దీంతో రైతులు బ్రతుకుదెరువుకు వలస వెళ్లే దుస్థితి ఏర్పడిందన్నారు. ఉపాధిహామీ పథకంలో పర్యావరహితమైన పనులను చేపట్టాలని కోరారు. వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులను నిషేధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామయ్య, నర్సయ్య, కృష్ణయ్య, గోపాల్, రామకృష్ణ, శివరాములు, రత్నయ్య, రాములమ్మ, జంగమ్మ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పోలీసుల పనితీరు భేష్

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

శంకర్‌పల్లి: శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమైనదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం ఆయన జనవాడ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన మోకిల నూతన పోలీస్ స్టేషన్‌ను రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పోలీస్ శాఖ అమలు చేస్తున్న నూతన విధానాల ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా క్రైం రేటు తగ్గిపోయిందన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు సత్వర న్యాయ పరిష్కారం లభిస్తోందన్నారు. ప్రజల అవసరాల నిమిత్తం ప్రభుత్వం నూతన పోలీస్ స్టేషన్‌లను ప్రారంభిస్తుందన్నారు. మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలోని 14 గ్రామాలుంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సాధనరష్మి పెరుమళ్, నార్సింగి ఏసీపీ రమణ గౌడ్, చేవెళ్ల ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, సీఐలు నరేశ్, శివకుమార్, సంజయ్ కుమార్, ఎస్‌ఐ కృష్ణ, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, నాయకులు నర్సింహ తదితరులు ఉన్నారు.

గాలివానకు నేలకొరిగిన బొప్పాయి తోట



గాలివానకు నేలకొరిగిన బొప్పాయి మొక్కలు

దోమ: మండలంలోని గుండాల గ్రామంలో ఆదివారం కురిసిన గాలివానకు బొప్పాయి తోట దెబ్బతింది. గాలి తీవ్రతకు బొప్పాయి చెట్లు నేలకొరిగాయి. కాయలు రాలిపోయాయి. గ్రామానికి చెందిన జగన్నాథ్ అనే రైతు నాలుగు ఎకరాల పొలంలో బొప్పాయి పంట సాగు చేశాడు. అకాల వర్షంతో తోట దెబ్బతింది. పంట చేతికి వచ్చే సమయంలో దెబ్బతినిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ. 2లక్షల మేర నష్టం వాటిల్లిందని తెలిపాడు. అధికారులు పొలాన్ని సందర్శించి పంట నష్టపరిహారం అందేలా చూడాలని బాధిత రైతు కోరారు.

ఆగిఉన్న లారీని ఢీకొన్న బైక్ వ్యక్తి మృతి



సుభానయ్య (ఫైల్)

పరిగి: ఆగిఉన్న లారీని బైక్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన రంగాపూర్‌లో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి కథనం మేరకు.. రంగాపూర్‌కు చెందిన కే సుభనయ్య(30) నగరంలో ఉద్యోగం చేస్తున్నాడు. విధులు ముగించుకొని రంగాపూర్‌కు వస్తున్న క్రమంలో గ్రామ సమీపంలో ఆగివున్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.